# ప్రజా మార్పులు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు



తెలంగాణ రాష్ట్ర పండుగగా వాసవీ మాత జయంతి... ఉత్తర్వులు జారీ


ప్రచురణ : జగిత్యాల  సంపుటి : 05  సంచిక : 264  పేజిలు : 04  వెల రూ. 2  శుక్రవారం  24 - 04 - 2026


## సీఎం రేవంత్ అధ్యక్షతన

# కేబినెట్ భేటీ

- సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ భేటీ
- ఆర్టీసీ సమ్మెపై కార్మిక సంఘాలతో చర్చించాలని ప్రభుత్వం నిర్ణయం
- కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఒత్తిడి చేయాలని కేబినెట్ నిర్ణయం
- నేడు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రుల బృందం కార్మిక సంఘాలతో చర్చలు




**హైదరాబాద్ :**
సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్టీసీ సమ్మెపై రేపు కార్మికులతో మాట్లాడాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి మంత్రులను ఆదేశించారు. నేడు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రుల బృందం కార్మిక సంఘాలతో చర్చలు జరపనుంది. కేబినెట్ సమావేశంలో - మిగతా 2 లో




## నర్సంపేటలో నిప్పంటించుకున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్

- రెండో రోజుకు చేరుకున్న ఆర్టీసీ సమ్మె
- నర్సంపేట డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న శంకర్ గౌడ్
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం లేదంటూ నిప్పంటించుకున్న డ్రైవర్

## తెలంగాణలోని అన్ని పాఠశాలలకు

## నేటి నుంచి వేసవి సెలవులు



- నేటి నుంచి 50 రోజుల పాటు వేసవి సెలవులు
- సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న తిరిగి ప్రారంభంకానున్న పాఠశాలలు

**హైదరాబాద్ :**
విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. రేపటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఏప్రిల్ 23 విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి. - మిగతా 2 లో

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు

- కేంద్రం కీలక ప్రకటన
- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం
- ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశపూర్వకమని వెల్లడి
- గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ







## హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత

- హర్మూజ్ జలసంధి నుంచి 14 భారత నౌకలు సురక్షితంగా బయటపడ్డాయన్న కేంద్రం
- పర్షియన్ గల్ఫ్‌లో మరో 14 నౌకలు ఉన్నట్టు తెలిపిన విదేశాంగ శాఖ
- ముంద్రా పోర్టుకు వస్తున్న నౌకపై బుధవారం దాడి చేసిన ఇరాన్
- నౌకలపై దాడుల ఘటనపై ఇరాన్‌కు భారత్ తీవ్ర నిరసన
- గత శనివారం రెండు భారత నౌకలపై కాల్పులు జరిపిన ఇరాన్

## తమిళనాడు, బెంగాల్‌లో

# ముగిసిన పోలింగ్



- రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు
- సాయంత్రం 5 గంటలకే తమిళనాడులో 82.24%, బెంగాల్‌లో 89.93% ఓటింగ్
- కన్యాకుమారిలో పడవల్లో డ్యామ్ దాటి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు
- 2021 ఎన్నికల నాటి పోలింగ్ శాతాన్ని అధిగమించిన రెండు రాష్ట్రాలు
- డీఎంకే కూటమి 200కు పైగా సీట్లు గెలుస్తుందని ఎండీఎంకే నేత వైగో ధీమా

**చెన్నై :**
తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ - మిగతా 2 లో

## అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం

- బెంగాల్‌ను విముక్తం చేయండి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా
- హుగ్లీ జిల్లా బాలాగర్ లో అమిత్ షా బహిరంగసభ
- బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం రాగానే అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తామన్న అమిత్‌షా
- మే 5వ తేదీతో మమతా బెనర్జీ పాలన ముగుస్తుందని ధీమా









## కొత్త పింఛన్లపై ఏపీ ప్రభుత్వం

# కీలక నిర్ణయం

- ఏపీలో కొత్త పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం కసరత్తు
- తొలి విడతగా వితంతువులకు జూన్ 12 నుంచి పింఛన్లు
- రాష్ట్రవ్యాప్తంగా 1.53 లక్షల మందికి కొత్తగా ప్రయోజనం
- ఆ తర్వాత దివ్యాంగులకు కొత్త పింఛన్లు ఇచ్చే యోచన
- కొత్త పింఛన్ల కోసం 10 లక్షల దరఖాస్తులు వస్తాయని అంచనా

**అమరావతి :**
ఏపీలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మందికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా - మిగతా 2 లో

# అనకాపల్లిని అదృష్టం వరించింది

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతాం
- రాంబిల్లిలో రూ.5,400 కోట్లతో రెన్యూ సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రాంబిల్లిలో సోలార్ ఇన్‌గాట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుందన్న సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యమని వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ ధ్వంసమైందని విమర్శ
- విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ



**అమరావతి :**
భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఈ జిల్లా పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గతంలో వెనుకబడిన రంగారెడ్డి జిల్లా ఎలాగైతే సంపన్న ప్రాంతంగా మారిందో, విశాఖకు సమీపంలో ఉన్న అనకాపల్లిని కూడా మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ సోలార్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 6.5 గిగావాట్ల ఇన్‌గాట్-వేఫర్ తయారీ - మిగతా 2 లో

# సంపాదకీయం

## యుద్ధాల్లో ఓడిపోతున్న గ్రంథాలయాలు!

యుద్ధాలకు, గ్రంథాలయాలకు మధ్య చరిత్రలో ఒక విషాదకరమైన సంబంధం ఉంది. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే అక్కడి సాంస్కృతిక వారసత్వ సంపదతోపాటు జ్ఞాన సంపదపైనా గురి పెడతారు. అందులో భాగంగా జ్ఞాన నిలయాలైన గ్రంథాలయాలు దాడికి గురవుతాయి. ఒక సమాజపు సామూహిక జ్ఞాపకాలను, గుర్తింపును, జ్ఞానాన్ని తుడిచిపెట్టేందుకు గ్రంథాలయాలపై దాడి చేయటమన్నది చరిత్రలో ఎన్నోసార్లు జరిగింది.గ్రంథాలయాలు ఒక జాతికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, చరిత్ర, సాహిత్యం, మేధో సంపత్తి మొదలైనవాటిని పుస్తక రూపంలో భద్రపరుస్తాయి, తరాల మధ్య వారధిగా పనిచేస్తాయి. కాబట్టి వాటిని నాశనం చేయడం ద్వారా ప్రస్తుత పాలనను, భవిష్యత్తు పునర్నిర్మాణాన్ని కూడా బలహీనపరచవచ్చు. కొన్ని సందర్భాల్లో ఈ దాడులు వ్యూహాత్మకంగా జరుగుతాయి. ఉదాహరణకు, సైనిక కమాండ్ లేదా పరిశోధనా కేంద్రాలుగా ఉపయోగపడే విశ్వవిద్యాలయ గ్రంథాలయాలపై దాడులు చేస్తారు. మరికొన్ని సందర్భాల్లో సాంస్కృతిక వారసత్వాన్ని, సామూహిక గుర్తింపును విచ్ఛిన్నం చేయడానికి దాడులు చేస్తారు.ప్రాచీన అలెగ్జాండ్రియా గ్రంథాలయం నుండి ఆధునిక కాలం వరకు గ్రంథాలయాల విధ్వంసం అనేది ఒక ఉద్దేశపూర్వక చర్య అని చరిత్ర పదేపదే నిరూపించింది. రష్యాఉక్రెయిన్ యుద్ధంలో దాదాపు 800లకు పైచిలుకు గ్రంథాలయాలు మట్టిలో కలిసిపోయాయి. కొన్ని వందల వేల సంవత్సరాల నుండి ఈ గ్రంథాలయాల్లో దాచిన దాదాపు 200 మిలియన్ల పుస్తక సంపద ఈ దాడుల్లో ధ్వంసమైంది. అలాగే, అమెరికా, ఇజ్రాయెల్ఇరాన్ల మధ్య ఫిబ్రవరి 28, 2026న దాడులు ప్రారంభమైనప్పటి నుండి కొన్ని వందల సంఖ్యల్లో గ్రంథాలయాలు కుప్పకూలాయి. ఆ గ్రంథాలయాల్లో కాపాడుతూ వచ్చిన వేల సంవత్సరాల పుస్తక జ్ఞాన సంపద అంతా నాశనమైంది. గ్రంథాలయాల నష్టంపై సమగ్ర నివేదికలు ఇంకా వెలువడుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఉన్న నివేదికల ప్రకారం విస్తృతమైన సాంస్కృతిక వారసత్వం కలిగిన విశ్వవిద్యాలయ ప్రాంగణాలు ఎక్కువగా నష్టపోయాయి.మన దేశ చరిత్రలో జరిగిన యుద్ధాలలోనూ వెలకట్టలేని విజ్ఞా సంపదకు నిలయాలైన గ్రంథాలయాలు ఎన్నో ధ్వంసమయ్యాయి. ఉదాహరణకు 1193 సీఈలో బఖ్తియార్ ఖిల్జీ నలందా విశ్వవిద్యాలయంపై దాడి చేసినప్పుడు దాదాపు 90లక్షల తాళపత్ర గ్రంథాలు ఉన్న ఈ గ్రంథాలయం నెలల తరబడి కాలిందని చరిత్ర చెబుతున్నది. మధ్యయుగ దండయాత్రల సమయంలో భారతదేశం అంతటా అనేక గ్రంథాలయాలు, తాళపత్రాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడుల వల్ల హిందూ, బౌద్ధ, ప్రాచీన భారతీయ జ్ఞాన వ్యవస్థల అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగింది.గ్రంథాలయం అంతరించడం అంటే కేవలం ఒక భవనం కూలిపోవడం కాదు; అది ఒక నాగరికత తాలూకు సామూహిక జ్ఞాపకశక్తి సగంలో తెగిపోవడం. ఇప్పుడున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటలీకరణ ద్వారా ఎప్పటికప్పుడు మనకున్న జ్ఞాన సంపదను డిజిటల్ డేటాగా మార్చి సురక్షితంగా నిక్షిప్తం చేయడం ద్వారా విలువైన జ్ఞాన సంపదను యుద్ధకాలపు విపత్కర పరిస్థితుల నుండి కాపాడవచ్చు. రేపు పుస్తక దినోత్సవం సందర్భంగా ఈ అంశంపై జరగాల్సిన చర్చను ప్రభుత్వాలు మరోమారు గుర్తు చేసుకోవాలి.

## అమరావతి రాజధానిగా కొత్త మ్యాప్ విడుదల

**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి శాశ్వత హోదా కల్పిస్తూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా కొత్త మ్యాప్‌ను విడుదల చేశాయి. దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఒక రాష్ట్ర రాజధానిని ఖరారు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేసిన సంగతి తెలిసిందే.ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు-2026కు పార్లమెంట్ ఆమోదం తెలపడంతో, అమరావతికి తిరుగులేని అధికారిక హోదా దక్కింది. 2024 జూన్ 2 నుండి ఇది అమల్లోకి వచ్చేలా చట్టం చేయడం గమనార్హం. దీంతో గత కొన్నేళ్లుగా సాగుతున్న 'మూడు రాజధానుల' గందరగోళానికి శాశ్వతంగా తెరపడింది.ఏపీ అడ్మినిస్ట్రేటివ్ మ్యాప్‌లో మరో కీలక మార్పు చోటుచేసుకుంది. కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలను ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో మొత్తం జిల్లాల సంఖ్య 28కి చేరింది. ఈ నూతన జిల్లాల సరిహద్దులతో కూడిన అధికారిక పటాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం కూడా తన రికార్డుల్లో, భారత అధికారిక మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని అప్‌డేట్ చేసింది. ఇది దేశవ్యాప్త పరిపాలన అవసరాలకు ప్రామాణికంగా నిలవనుంది.

## తెలంగాణలోని అన్ని పాఠశాలలకు నేటి నుంచి వేసవి సెలవులు

**మొదటిపేజీ తరువాయి - సమ్మర్ హాలిడేస్ షెడ్యూల్:**

ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి.జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి.సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

## నర్సంపేటలో నిప్పంటించుకున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్



**మొదటిపేజీ తరువాయి -** ఆర్టీసీ కార్మికుల డిమాండ్లపై ప్రభుత్వం స్పందించడం లేదంటూ ఒక కార్మికుడు ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె నేడు రెండవ రోజుకు చేరుకుంది. పలుచోట్ల ఉద్యోగులు నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న కోలా శంకర్ గౌడ్ ఒంటిపై తన శరీరానికి నిప్పంటించుకున్నాడు.ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ప్రభుత్వంలో విలీనం చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ, బస్టాండ్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని వరంగల్‌లోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

## సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ



**మొదటిపేజీ తరువాయి -** సమ్మెపై ప్రధానంగా చర్చ జరిగింది. నర్సంపేట, నల్గొండ ఘటనల నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో దృష్టి పెట్టిందని సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా నేడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు ఆర్టీసీ కార్మిక సంఘాలను పిలిచి మాట్లాడాలని ఆదేశించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**కాళేశ్వరం అంశంపై కేబినెట్ చర్చ :** అలాగే, కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపైనా కూడా చర్చ జరిగింది. ఈ కేసులో జదీ× విచారణకు ఒత్తిడి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం.

# అనకాపల్లిని అదృష్టం వరించింది

**మొదటిపేజీ తరువాయి -** ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధిపై తన ప్రభుత్వ దార్శనికతను ఆవిష్కరించారు.

**పెట్టుబడులతో పునర్నిర్మాణం**

గత ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాలన్న ఏకైక లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు రెన్యూ ఎనర్జీ సంస్థ భారీ పెట్టుబడితో ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు జయంత్ సిన్హా వేగంగా అభివృద్ధి చెందుతున్న సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం రాష్ట్రంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, రాంబిల్లిలో సోలార్ ఫలకాల తయారీ పరిశ్రమ రావడం ద్వారా రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

**గ్రీన్ ఎనర్జీయే లక్ష్యం**



రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ రంగంలో రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. 90 గిగావాట్ల మేర ప్రతిపాదనలు, ఒప్పందాలు (ఎంఓయూలు) సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఒక్క ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ సంస్థే రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోందన్నారు. అభివృద్ధికి విద్యుత్ వినియోగం ఒక సూచిక అని, అందుకే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వివరించారు. దీనిలో భాగంగా పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, ఆర్టీసీ కూడా 1,050 గ్రీన్ బస్సులను ప్రవేశపెడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని చంద్రబాబు ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) రద్దు చేయడం, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వంటి చర్యలతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందన్నారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని మోపి 'ట్రూ అప్' ఛార్జీల రూపంలో వసూలు చేశారని విమర్శించారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తమ ప్రభుత్వం ప్రారంభించిన విద్యుత్ సంస్కరణల ఫలాలను ప్రజలకు అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కొత్త పింఛన్లపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి -** జూన్ 12వ తేదీ నుంచి తొలి విడతగా వితంతువులకు నెలకు రూ.4,000 చొప్పున పింఛన్లు అందించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు అర్హుల గుర్తింపు, నిధుల సమీకరణపై అధికారులు దృష్టి సారించారు.అధికారిక అంచనాల ప్రకారం రాష్ట్రంలో కొత్తగా 1.53 లక్షల మంది వితంతు పింఛన్‌కు అర్హులుగా ఉన్నారు. వీరందరికీ పింఛన్లు మంజూరు చేస్తే, ప్రభుత్వానికి నెలకు రూ.61 కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు లెక్కగట్టారు. కాగా, కూటమి ప్రభుత్వం ఇప్పటికే పింఛన్ తీసుకునే భర్త మరణిస్తే, వారి భార్యలకు 'స్పౌజ్' కేటగిరీ కింద వెంటనే పింఛన్ మంజూరు చేస్తోంది. ఈ విధానంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు సుమారు 2.30 లక్షల మందికి కొత్తగా పింఛన్లు అందాయి. అయితే, 60 ఏళ్లలోపు మగవారికి పింఛన్లు అందకపోవడంతో భర్త చనిపోయిన మహిళలకు వితంతు కోటాలో పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.వితంతు పింఛన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత, దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దివ్యాంగుల కేటగిరీలో సుమారు లక్ష మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. అయితే, ప్రస్తుతం దివ్యాంగుల కోటాలో 6.50 లక్షల మంది పింఛన్ తీసుకుంటుండగా, వారిలో దాదాపు లక్ష మంది అనర్హులు ఉన్నారని ప్రభుత్వం గుర్తించింది. సదరం సర్టిఫికెట్లలోని లోపాలను సరిదిద్ది, అనర్హులను




ఏరివేసే ప్రక్రియపై అధికారులు దృష్టి సారించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక, అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు.ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం వృద్ధులు, ఒంటరి మహిళలు, ఆరోగ్య పింఛన్లతో కలిపి మొత్తం 28 కేటగిరీలలో లబ్ధిదారులకు ప్రతినెలా పింఛన్లు పంపిణీ చేస్తోంది. కొత్త పింఛన్ల కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేటగిరీలలో కలిపి దాదాపు 10 లక్షల మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీరందరికీ పింఛన్లు మంజూరు చేస్తే, నెలకు రూ.400 కోట్లు, ఏడాదికి రూ.4,800 కోట్ల మేర అదనపు భారం పడనుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దశలవారీగా అర్హులకు పింఛన్లు అందించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. దీనిపై త్వరలోనే పూర్తిస్థాయి స్పష్టత రానుంది.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు

**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది. ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది.ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ




రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

**దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా**

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

# తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు. ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం, సాయంత్రం 5 గంటలకే పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం, తమిళనాడులో 82.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం.తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే), తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. చెన్నైలో పోలింగ్ చివరి గంటలో, ఓటర్లు తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఏఐఏడీఎంకే అభ్యర్థి డి. జయకుమార్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా



ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు.అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని 152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం



**మొదటిపేజీ తరువాయి -** పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుగ్లీ జిల్లా బాలాగర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భద్రత, ఆర్థిక వ్యవస్థపై అక్రమ వలసల ప్రభావాన్ని ఎండగట్టారు.బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాగానే ఒక్కరిని కూడా అక్రమంగా సరిహద్దు దాటి రానివ్వబోమని, ఇప్పటికే ఉన్న వారిని గుర్తించి పంపించివేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు దక్కాల్సిన రేషన్, ఉద్యోగాలను ఈ అక్రమ వలసదారులు లాగేసుకుంటున్నారని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఆటంకమని ఆరోపించారు.మీరు వేసే ఓటు కేవలం ఒక ఎమ్మెల్యే కోసమే కాదని, అక్రమ చొరబాటుదారుల నుంచి బెంగాల్ విముక్తి కోసం కూడా అని పేర్కొన్నారు. మే 5వ తేదీతో 'దీదీ' పాలన ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.నేడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి తొలి దశ (152 స్థానాలు) పోలింగ్ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికే దాదాపు 89 శాతానికి పైగా భారీ ఓటింగ్ నమోదైంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

## హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తత



**మొదటిపేజీ తరువాయి -** హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, గత కొన్ని వారాల్లో 14 భారత నౌకలు ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా బయటపడ్డాయని కేంద్ర విదేశాంగ శాఖ వెల్లడించింది. అయితే, మరో 14 నౌకలు ఇంకా పర్షియన్ గల్ఫ్‌లోనే ఉన్నాయని తెలిపింది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గురువారం న్యూఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలు తెలిపారు.పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో, ప్రపంచ చమురు వాణిజ్యంలో ఐదో వంతు జరిగే హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. కాల్పుల విరమణ ప్రకటించిన కొన్ని గంటల్లోనే, భారత్‌లోని ముంద్రా పోర్టుకు వస్తున్న 'ఎపామినోడాస్' అనే నౌకపై ఇరాన్ దాడి చేసింది. లైబీరియా జెండాతో ఉన్న ఈ నౌకతో పాటు మరో షిప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది.అంతకుముందు గత శనివారం కూడా, అనుమతి పొందిన రెండు భారత నౌకలపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫతాలీని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిశ్రీ పిలిపించి మాట్లాడారు. భారత నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కాల్పులు జరపడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య నౌకల భద్రతకు భారత్ ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.గతంలో భారత్‌కు వచ్చే నౌకలకు ఇరాన్ సురక్షిత మార్గాన్ని కల్పించిన విషయాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, నౌకల రాకపోకలను తిరిగి సులభతరం చేయాలని కోరినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

## ప్రజా పాలన ప్రగతి నివేదన 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం





**జగిత్యాల ఏప్రిల్(ప్రజా మంటలు) :**ప్రజా పాలన ప్రగతి నివేదనలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ , మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు.విద్యార్థులతో మమేకమై వారి అభ్యాస పరిస్థితులు, వసతి సదుపాయాలు, ఆహార నాణ్యతపై ఆరా తీశారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని, గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు అందుతున్న సదుపాయాలపై తమ అభిప్రాయాలను వెల్లడించగా, అధికారులను త్వరితగతిన పరిష్కరించుటకు ఆదేశించారుఇట్టి కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ సంగనబట్ల దినేష్, ఆర్డీవో మధుసూదన్, డీసీసీ అధ్యక్షులు నందయ్య, కౌన్సిలర్లు దుమాల రాజ్ కుమార్, బడుగు పద్మ రాజేందర్, బొల్లరపు స్వప్న గిరిధర్, ఖాజా కమలుద్దిన్, మాజీ చైర్మెన్ గిరి నాగభూషణం, నాయకులు బండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ కళ్యాణానికి 50వేల 116 రూపాయలు విరాళంగా


### మంత్రి పొన్నం ప్రభాకర్ తరపున అందజేసిన కాంగ్రెస్ నాయకులు



**ఎల్కతుర్తి ఏప్రిల్ 23 ప్రజా మంటలు :** హుస్నాబాద్ నియోజకవర్గం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం ఈనెల 26 27 28. తేదీలలో జరగనుంది ఎల్కతుర్తి గౌడ సంఘం నాయకులు గౌడ కుటుంబ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి కళ్యాణ మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో మంత్రిని ఆహ్వానించడం జరిగింది మంత్రి పొన్నం ప్రభాకర్ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవానికి నా వంతుగా 50వేల 116 రూపాయలు కానుకలుగా అందజేస్తానని గౌడ సంఘం సోదరులకు తెలియజేశారు. గురువారం శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఎల్కతుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గౌడ సంఘం నాయకులకు 50, 116 రూపాయలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ, మంత్రి పొన్నం ప్రభాకర్ మా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణానికి కానుకలు అందజేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి కానుకలు అందజేసినందుకు మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. కళ్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ విచ్చేసి కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి, కాంగ్రెస్ నాయకులు శీలం అనిల్ కుమార్, మార్కెట్ డైరెక్టర్ గొడిశాల రాజయ్య గౌడ్, గొడిశాల యాదగిరి గౌడ్, శనిగరపు వెంకటేష్, డాక్టర్ బొల్లె పోగు రమేష్ బాబు, అంబాల శ్రీకాంత్, జనగాని లక్ష్మీనారాయణ గౌడ్, గొడిశాల అర్జున్ గౌడ్, వీణవంక రమేష్ చారి, బుచ్చి రాములు గౌడ్, శ్రీపతి సదానందం గౌడ్, కందుకూరి మహేష్ చారి, మరియు గౌడ సంఘం నాయకులు గోడిశాల కుమార్ గౌడ్, మాజీ అధ్యక్షుడు రవి, రాజేష్ గౌడ్, సుమన్ గౌడ్, విక్రమ్, సురేష్, కుమారస్వామి, శ్రీకాంత్, మహిపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పిర్యాదుపై చర్యలు తెలుపండి

### కమిషన్ నే "సమాచారం" కోరిన ఆర్టీఐ కార్యకర్త



**బుగ్గారం / జగిత్యాల జిల్లా:** జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులపై తాను పిర్యాదు చేశానని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కు సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి గుర్తు చేశారు. జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారులపై తేది: 27-10-2025 న చుక్క గంగారెడ్డి ప్రత్యేకంగా ఒక పిర్యాదు చేశారు. అట్టి పిర్యాదు పై తీసుకున్న చర్యల వివరాలు తెలుపాలని సమాచార హక్కు చట్టం - 2005 సెక్షన్ 6 (1) ప్రకారం ఆయన తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో బుధవారం దరఖాస్తు చేశారు. ఇట్టి పిర్యాదుపై నేటి వరకు కనీస సమాచారం కూడా తనకు లేదని ఆయన అట్టి దరఖాస్తులో పేర్కొన్నారు.

## జిల్లా పంచాయతీ అధికారులపై మండిపడ్డ "సమాచార కమీషన్"

### పరిహారం కోరిన సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి

**బుగ్గారం, ఏప్రిల్ 22 (ప్రజా మంటలు):**జగిత్యాల జిల్లా పంచాయతీ అధికారుల పనితీరుపై తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని సీనియర్ ఆర్టీఐ కార్యకర్త చుక్క గంగారెడ్డి గురువారం విలేఖరుల సమావేశంలో వెల్లడిం చారు.తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్ జారీ చేసిన మొత్తం 18 ఆదేశాలకు సంబంధించి జిల్లా పంచాయతీ అధికారులు అవసరమైన సమాచారం అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన పేర్కొన్నారు. అందులో నాలుగు కేసుల్లో మొదటి ఆదేశాల తరువాత కూడా సమాచారం ఇవ్వకపోవడంతో కమీషన్ రెండోసారి ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఇప్పటివరకు స్పందన లేకపోవడం గమనార్హమని తెలిపారు.ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన విచారణలో సమాచార కమీషన్ జిల్లా పంచాయతీ అధికారులపై తీవ్రంగా మండిపడినట్లు గంగారెడ్డి చెప్పారు. గత ఆరు సంవత్సరాలుగా సమాచార హక్కు చట్టం అమలులో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడమే కాకుండా, తమ విధులను దుర్వినియోగం చేశారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, కమీషన్ ఆదేశాలను కూడా పట్టించుకోకుండా వ్యవహరించారని వివరించారు.ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల దృష్ట్యా పరిహారం మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర సమాచార కమీషన్‌కు వ్రాతపూర్వకంగా వినతి పత్రం సమర్పించినట్లు గంగారెడ్డి తెలిపారు. సకాలంలో సమాచారం అందించకపోవడం సమాచార హక్కు చట్టానికి విరుద్ధమని, అందువల్ల బాధ్యులపై చర్యలతో పాటు పరిహారం చెల్లించాల్సిందేనని కమీషన్ స్పష్టం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.






## ఎల్కతుర్తి మండలంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో అయోమయం



**ఎల్కతుర్తి ఏప్రిల్ 23 ప్రజా మంటలు :**ఎల్కతుర్తి మండలంలో ఇటీవల చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తున్నాయి. ముఖ్యంగా బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన మాజీ సింగిల్ విండో చైర్మన్ ను ప్రస్తుత ఏఎంసి చైర్మన్ వెంబడించుకొని ఐకెపి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది. ఇద్దరు కలిసి ఐకెపి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం వెనుక అంతర్యం ఏమిటి అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. వేరు వేరు పార్టీలకు చెందిన నాయకులు ఇలా కలిసికట్టుగా వ్యవహరించడం రైతుల్లో అనుమానాలకు తావితీస్తోంది ముఖ్యంగా రైతుల నోటికాడబుక్కను లాగేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్పష్టత లేకపోవడం వంటి అంశాలపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు రైతులు కలిసి రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి మండల స్థాయి నాయకులకు విన్నవించుకుంటున్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు.

## నాదెండ్ల భాస్కరరావు అంత్యక్రియల్లో మాజీ మంత్రి మర్రి



**సికింద్రాబాద్, ఏప్రిల్ 23 ( ప్రజా మంటలు):**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అంత్యక్రియలు పంజాగుట్ట స్మశాన వాటికలో గురువారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి, బిజెపి యువ నాయకుడు మర్రి పురురవ రెడ్డి పాల్గొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం భాస్కరరావు కుమారుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. భాస్కరరావు రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు కూడా పాల్గొని నివాళులర్పించారు.

## ఫీజు బకాయిలు చెల్లించాల్సిందే

### సికింద్రాబాద్ పీజీ కాలేజీలో ఏబీవీపీ నిరసన దీక్ష




**సికింద్రాబాద్,ఏప్రిల్ 23 ( ప్రజామంటలు):**రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ జిల్లా పీజీ కాలేజీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ సిటీ సెక్రెటరీ పృథ్వీ తేజ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు పది వేల కోట్ల రూపాయల ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, ఇది విద్యార్థులకు ప్రభుత్వం వేస్తున్న భిక్ష కాదని, వారి రాజ్యాంగబద్ధమైన హక్కు అని స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్రం కోసం 1200 మంది విద్యార్థులు బలిదానాలు చేసుకుంటే, నేడు రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా విద్యార్థుల జీవితాల్లో మాత్రం మార్పు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ కేవలం మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం పంపిస్తున్న స్కాలర్‌షిప్ నిధులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం వల్ల ఆ నిధులు వెనక్కి వెళ్లిపోతున్నాయని, ఇది విద్యార్థులకు జరుగుతున్న తీరని అన్యాయమని పృథ్వీ తేజ పేర్కొన్నారు.ప్రభుత్వం మొండివైఖరి వీడి వెంటనే నిధులను విడుదల చేయాలని, లేనిపక్షంలో ధర్నాలు, రాస్తారోకోలు, ముట్టడి కార్యక్రమాలతో మరో తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నగేష్, జిల్లా కన్వీనర్ చేర్క బాలకృష్ణ, వర్సిటీ ప్రెసిడెంట్ అభినయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గౌతమ్, పవన్, గణేష్, రవి, శ్రీకాంత్, విజయ్, వంశీ, కిషోర్, వెన్నెల, నీరజ తదితర విద్యార్థి నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారుద

## అమరావతి రైతులకు చంద్రబాబు సర్కారు గుడ్ న్యూస్

### ల్యాండ్ పూలింగ్ రైతులకు కౌలు పెంచుతూ కీలక నిర్ణయం

### రాష్ట్రానికి ఆదాయాన్నిచ్చే నగరంగా అమరావతి అభివృద్ధి

### వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు సీఆర్డీఏ సమావేశంలో ఆమోదం

### ప్రతిష్టాత్మక విద్యా, ప్రభుత్వ సంస్థలకు భూముల కేటాయింపు

### 2027 నుంచి బిట్స్ పిలానీలో అడ్మిషన్లు ప్రారంభం



అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. వారి జీవనోపాధికి భరోసా కల్పిస్తూ వార్షిక కౌలును గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్ట భూములకు ఎకరాకు ఇచ్చే కౌలును రూ.40 వేలకు, జరీబు భూములకు రూ.60 వేలకు పెంచింది. అంతేకాకుండా, రాబోయే పదేళ్లపాటు ప్రతీ ఏటా మెట్ట భూములకు రూ.3 వేలు, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున కౌలు పెంచేందుకు కూడా ఆమోదం తెలిపింది. . సచివాలయం, జీఏడీ, హెచ్‌ఓడీ టవర్ల నిర్మాణంలో అత్యంత కీలకమైన ఫాసేడ్, గ్లేజింగ్, క్లాడింగ్ పనుల కోసం రూ.2540 కోట్లు, ఏపీ శాసనసభ భవనంలో వివిధ సివిల్ పనుల కోసం రూ.798 కోట్ల వ్యయానికి అథారిటీ ఆమోదం తెలిపింది. అమరావతిని హరిత, నీలి నగరంగా (గ్రీన్ అండ్ బ్లూ సిటీ), నివాసయోగ్యమైన నగరంగా (లివబుల్ సిటీ) తీర్చిదిద్దుతున్నామని పునరుద్ఘాటించారు.

## జిల్లా అదనపు ఎస్పీగా చేతన్ నితిన్ బాధ్యతలు స్వీకరణ




**జగిత్యాల ఏప్రిల్ 23(ప్రజా మంటలు) :**జిల్లా అదనపు ఎస్పీ గా చేతన్ నితిన్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు.అనంతరం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను ను అందజేయడం జరిగింది.చేతన్ నితిన్ ఐపిఎస్., 2022 బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలో జనగామ ఏఎస్పి గా విధులు నిర్వర్తించారు.

## ఆపదలో ఉన్న అన్న అని ఆశ్రయిస్తే

### స్కూటీ ఇచ్చిండు మా అన్న లచ్చన్న

### మంత్రి లక్ష్మణ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపిన జొన్నల శిరీష




**గొల్లపల్లి ధర్మపురి ఏప్రిల్ 23ప్రజా మంటలు అంకం భూమయ్య :**కష్టాల్లో ఉన్న అన్న అని ఆశ్రయిస్తే ఇచ్చి స్కూటీ ఇచ్చి ఆదుకున్నాడు మా అన్న లచ్చన్న అని దివ్యాంగురాలు శిరీష సంతోషం వ్యక్తం చేసింది.. వివరాల్లోకి వెళ్లితే.. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నామపూర్ గ్రామానికి చెందిన జొన్నల శిరీష దివ్యాంగురాలుకుటుంబ పోషణ కోసం హైదరాబాద్ లో ఓ ప్రైవేట్ కంపెనీలో శిరీష ఉద్యోగం చేస్తుంది. ఉద్యోగానికి నిత్యం వెళ్ళుతున్న శిరీషకు హైదరాబాద్ మహానగరంలో ప్రయాణం చేయడం కష్టంగా మారింది. నేపథ్యంలో తనకు ప్రభుత్వం ద్వారా సహాయం అందించాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఇటీవల ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి కష్టాలు చెప్పుకోవడంతో చలిచి పోయిన మంత్రి లక్ష్మణ్ కుమార్ శిరీషకు తన శాఖ ద్వారా స్కూటీని అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో గురువారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శిరీష కు స్కూటీ అందజేశారు. స్కూటీ అందుకున్న శిరీష ఆనందం వ్యక్తం చేసింది. ఆపదలో ఉన్న అన్న అని మంత్రి లచ్చన్నను కలవగానే తన కష్టాన్ని అర్థం చేసుకొని స్కూటీని అందించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి కి శిరీష ధన్యావాదాలు తెలిపారు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్



**జగిత్యాల రూరల్ ఏప్రిల్ 23( ప్రజా మంటలు) :**తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జగిత్యాల వారి ఆధ్వర్యం లో జగిత్యాల రూరల్ మండలం చల్గల్ వ్యవసాయ మార్కెట్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి ఎస్ లత, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డిసిసి అధ్యక్షులు గాజంగి నందయ్య ఏ ఎం సి ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, డి సి ఓ మనోజ్ డి సిఎస్ ఓ జితేందర్ రెడ్డి,ఎమ్మార్వో హాకిం, డి ఎం ఓ ప్రకాష్, సెక్రటరీ శ్రీనివాస్ రావు,మాజీ ఏ ఎం సి ఛైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి,నాయకులు బాల ముకుందం,జిల్లా మండల సర్పంచుల ఫోరమ్ గంగారెడ్డి, కట్ట రాజేందర్,ఏఎంసి డైరెక్టర్లు జయరాం సురేష్ సత్తిరెడ్డి నరేష్‌గంగారెడ్డి రాజన్న సుర శ్రీనివాస్ పోచయ్య అంజలి రాజిరెడ్డి రమేష్ శ్రీకాంత్,చల్గల్ గ్రామ నాయకులు అబ్బూరి మల్లేశం గౌడ్,దాసరి సతీష్,శ్రీనివాస్,సర్పంచులు, నాయకులు,రైతులు,అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.


## ఎస్ఎంసి కమిటీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



**గొల్లపల్లి ఏప్రిల్ 23ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలం లోని తిర్మలపూర్ (పి.డి) ప్రభుత్వ ఉర్దూ మద్యమా,ప్రాథమిక స్థాయిలో పాఠశాలలో గురువారం విద్యార్థులలో ఉత్సాహాన్ని పెంచేందు కు ఎస్.ఎం.సి కమిటీ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో భాగంగా చిన్నారి విద్యార్థిని విద్యార్థులు గ్రాడ్యుయేషన్ పట్టాలు (ప్రోగ్రేస్ కార్డులు) అందుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జ్ఞాపకాల తో ఈ వేడుకలు తల్లిదండ్రులను ఎంతో ఆకట్టుకున్నాయి. పాఠశాల హెడ్ మాస్టర్ మహమ్మద్ ముఖిముద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల గ్రాడ్యుయేషన్ వేడుకల ముఖ్యాంశాలు: ప్రాముఖ్యత: ప్రాథమిక విద్య పూర్తి చేసుకుని, ప్రాథమికోన్నత (ప్రైమరీ) పాఠశాలలో అడుగుపెడుతున్న విద్యార్థులనుఅభినందించడం దీని ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈ తరహాకార్యక్రమాలు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకాన్ని పెంచడంతో పాటు, విద్యార్థులలో ఉన్నత చదువుల పట్ల ఆసక్తిని కలిగిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముస్కం ఆంజనేయులు పంచాయతీ కార్యదర్శి విక్రమ్,ఉప అమ్మ ఆదర్శ పాఠశాల కమీటీ చైర్పర్సన్ రిహాన సభ్యులు నఫిస్, అప్సనా,గౌషియా, సైఫ సమ్రీన్,కుల్సుమ్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఖరిపై బిజెపి మండల అధ్యక్షుడి ఆగ్రహం

**ఎల్కతుర్తి ఏప్రిల్ 23 ప్రజా మంటలు :**ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే ఒక డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎల్కతుర్తి మండల బిజెపి అధ్యక్షుడు మస్తుర్తి శ్రీకాంత్ యాదవ్ విమర్శించారు. ఈ ఘటనకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను విస్మరించి కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. గాయపడిన డ్రైవర్ కు మెరుగైన వైద్యం అందించి ఖర్చులకు ప్రభుత్వం భరించాలని ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే బిజెపి తరఫున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.



# రాజకీయ విరామం తీసుకోవాల్సిన సమయం వచ్చింది

**మల్లికార్జున ఖర్గేపై రామచందర్ రావు సెటైర్లు**

**ఖర్గే రాహుల్ గాంధీ కనుసన్నల్లో నడుస్తున్నాడన్న రాంచందర్ రావు**

**వయసు రీత్యా రిటైర్మెంట్ తీసుకోవడం బెటర్ అని ఎద్దేవా**

**కాంగ్రెస్ కు ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్య**



ఎన్నికల వేళ రాజకీయ విమర్శలు తారస్థాయికి చేరుకున్నాయి. ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో, కేంద్ర ఎన్నికల సంఘం ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఈ పరిణామంపై తెలంగాణ బీజేపీ నేత రాంచందర్ రావు తీవ్రంగా స్పందించారు. ఖర్గే గా తన సొంత నిర్ణయాలతో కాకుండా, పూర్తిగా రాహుల్ గాంధీ కనుసన్నల్లోనే నడుస్తున్నారని ఆయన ఆరోపించారు. వయసు రీత్యా ఆయన రాజకీయాల నుంచి రిటైర్మెంట్ తీసుకోవడం ఉత్తమమని, ఆయన చేసే ప్రతి తప్పుడు ప్రకటనకు రాహుల్ గాంధీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజలే రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, నేడు పశ్చిమ బెంగాల్ లోక్‌సభ తొలి దశతో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బెంగాల్ ఓటర్లు ఎటువంటి భయం లేకుండా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాంచందర్ రావు కోరారు. ఎన్నికల సంఘం అక్కడ పటిష్ఠమైన భద్రత కల్పించిందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మే 4న వెలువడబోయే ఫలితాలు ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీకి సానుకూలమైన భారీ మార్పును తీసుకువస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రాజమండ్రి సమీపంలో పులి సంచారం

**ధ్రువీకరించిన అటవీశాఖ**

**రాజమండ్రి సమీపంలోని పాండవుల మెట్టపై పులి సంచారం**

**పులి అడుగుజాడలను గుర్తించి నిర్ధారించిన అటవీశాఖ అధికారులు**

**చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో తీవ్ర భయాందోళనలు**

**పశువులను మేతకు తీసుకురావద్దని, రాత్రుళ్లు ఒంటరిగా తిరగవద్దని హెచ్చరిక**

**పులి కదలికలపై నిఘా ఏర్పాటు**



పెద్దపులి సంచారం తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ప్రాంతంలోని గ్రామీణ ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. రాజమండ్రి సమీపంలోని కోరుకొండ మండలం, కాపవరం గ్రామ పరిధిలో ఉన్న పాండవుల మెట్టపై పెద్ద పులి సంచారంపై వదంతులు వ్యాపించాయి. కొన్ని రోజులుగా వినిపిస్తున్న వదంతులకు తెరదించుతూ, అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతంలో పులి ఉనికిని అధికారికంగా ధ్రువీకరించారు. మెట్ట ప్రాంతంలో పులి అడుగుజాడలను గుర్తించామని, దాని కదలికలపై నిఘా ఏర్పాటు చేశామని వారు వెల్లడించారు. అటవీశాఖ ప్రకటనతో కాపవరం సహా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. చీకటి పడితే పులి గ్రామాల్లోకి ఎక్కడ ప్రవేశిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. తమకు రక్షణ కల్పించాలని వారు అధికారులను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేశారు. పశువులను మేత కోసం అటవీ ప్రాంతం వైపు గానీ, మెట్టపైకి గానీ తోలుకెళ్లవద్దని స్పష్టం చేశారు. రాత్రి సమయాల్లో ఎవరూ ఒంటరిగా బయటకు రావద్దని సూచించారు. పులి ఎక్కడైనా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని, దానికి హాని తలపెట్టవద్దని కోరారు. ప్రస్తుతం అటవీ సిబ్బంది ఆ ప్రాంతంలో నిరంతరం గస్తీ కాస్తూ, పులి కదలికలను పర్యవేక్షిస్తున్నారు.

# భారత్, చైనాలపై వివాదాస్పద వ్యాఖ్యలను రీపోస్ట్ చేసిన ట్రంప్

**అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ రాసిన లేఖతో చెలరేగిన వివాదం**

**భారతీయులను 'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు'గా అభివర్ణించిన సావేజ్**

**అమెరికాలో పుట్టుకతో పౌరసత్వం ఇచ్చే చట్టంపై తీవ్ర వ్యతిరేకత**

**ట్రంప్ చర్యతో జాత్యహంకార వ్యాఖ్యలకు మద్దతు పలికినట్లు విమర్శలు**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. భారత్, చైనా వంటి దేశాలను "నరక కూపాలు" (ప్రవశ్రీశ్రీ-ప్రశ్రీశ్రీవం) అని సంబోధిస్తూ, అక్కడి వలసదారులపై జాత్యహంకార వ్యాఖ్యలు చేసిన ఒక పోస్టును ఆయన తన 'ట్రూత్ సోషల్' మీడియా ఖాతాలో రీపోస్ట్ చేశారు. ఈ చర్యతో ఆయనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ రాసిన ఈ పోస్టులో అమెరికాలో పుట్టుకతో పౌరసత్వం (ఎఱతీఏ్ప్రతీఱస్త్రష్ట్ ఎఱఱఓవఅంష్ట్రఱజూ) కల్పించే చట్టంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తపరిచారు. భారత్, చైనా వంటి దేశాల నుంచి ప్రజలు గర్భంతో ఉన్న తొమ్మిదో నెలలో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా ఆ పిల్లలు తక్షణమే అమెరికా పౌరులుగా మారుతున్నారని ఆయన ఆరోపించారు. "ఇక్కడ పుట్టిన బిడ్డ తక్షణమే పౌరుడు అవుతాడు. ఆ తర్వాత వాళ్లు చైనా, భారత్ లేదా భూమిపై ఉన్న మరో నరక కూపం నుంచి తమ పూర్తి కుటుంబాన్ని ఇక్కడికి తీసుకొస్తారు" అని సావేజ్ తన లేఖలో రాశారు. అంతటితో ఆగకుండా భారత్, చైనా నుంచి వచ్చిన వలసదారులను "ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు" అని అభివర్ణించారు. "ఈ దేశానికి మాఫియా కుటుంబాలు చేసిన నష్టం కంటే వీరే ఎక్కువ చేశారు. మన జెండాను అవమానించారు. మనల్ని దోచుకున్నారు" అంటూ తీవ్రమైన పదజాలంతో విరుచుకుపడ్డారు. కాలిఫోర్నియాలోని టెక్ కంపెనీలలో భారతీయులు, చైనీయుల ఆధిపత్యం పెరిగిపోయిందని, శ్వేతజాతీయులకు ఉద్యోగాలు దొరకడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ట్రంప్ ఈ లేఖను పోస్ట్ చేయడానికి ఒక రోజు ముందు, అమెరికా మినహా ప్రపంచంలో ఏ దేశంలోనూ పుట్టుకతో పౌరసత్వం ఇచ్చే విధానం లేదని ఓ ఇంటర్వ్యూలో తప్పుడు ప్రకటన చేశారు. వాస్తవానికి అమెరికా పొరుగు దేశాలైన కెనడా, మెక్సికో సహా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 36 దేశాల్లో ఆ గడ్డపై పుట్టిన వారికి పౌరసత్వం కల్పించే విధానం అమల్లో ఉంది. ఇప్పుడు సావేజ్ రాసిన జాత్యహంకార లేఖను ట్రంప్ స్వయంగా పంచుకోవడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

# కల్లులో కల్తీకి డ్రగ్స్.. హైదరాబాద్‌లో రూ.17 కోట్ల మత్తుపదార్థాలు సీజ్!

**హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించిన ఎన్‌సీబీ**

**మౌలాలిలో రూ.17.40 కోట్ల విలువైన అల్ప్రాజోలామ్ స్వాధీనం**

**కల్లులో కల్తీ చేసేందుకు డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు వెల్లడి**

**ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న అధికారులు**



హైదరాబాద్ నగరంలో సంచలనం రేపిన భారీ డ్రగ్స్ రాకెట్‌ను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు ఛేదించారు. మౌలాలి పారిశ్రామిక వాడలోని ఓ కెమికల్ యూనిట్ ముసుగులో అక్రమంగా డ్రగ్స్ తయారు చేస్తున్న కేంద్రాన్ని గుర్తించి మెరుపుదాడి చేశారు. ఈ ఆపరేషన్‌లో సుమారు రూ.17.40 కోట్ల విలువైన 69.6 కిలోల అల్ప్రజోలామ్ అనే మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఎన్‌సీబీ అధికారుల కథనం ప్రకారం, మౌలాలిలోని ఓ పారిశ్రామిక యూనిట్‌లో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు అందిన పక్కా సమాచారంతో ఈ దాడులు నిర్వహించారు. అక్కడి రెండు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో దాచి ఉంచిన అల్ప్రజోలామ్‌ను గుర్తించారు. వేసవిలో కల్లుకు ఉండే అధిక డిమాండ్‌ను లక్ష్యంగా చేసుకుని, కల్లులో కల్తీ చేసేందుకు ఈ డ్రగ్స్‌ను భారీ ఎత్తున తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కల్తీ కల్లు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన ముగ్గురిలో డ్రగ్స్ తయారీలో నైపుణ్యం ఉన్న కెమిస్ట్, ముడి పదార్థాలు సరఫరా చేసే వ్యక్తి, తయారైన డ్రగ్స్‌ను స్వీకరించే వ్యక్తి ఉన్నట్లు ఎన్‌సీబీ అధికారులు తెలిపారు. వీరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్ వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారు, రాష్ట్రంలో ఎక్కడికి సరఫరా చేస్తున్నారనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

# ఏప్రిల్ 25న బాధ్యతలు స్వీకరించనున్న ఏపీ హైకోర్టు కొత్త సీజే జస్టిస్ లిసా గిల్

**ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ లీసా గిల్ నియమితులు**

**రేపు పదవీ విరమణ చేయనున్న ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్**

**ఏప్రిల్ 25న బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ లీసా గిల్**

**సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి**



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చరిత్రలో ఒక నూతన అధ్యాయం మొదలైంది. హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా జస్టిస్ లీసా గిల్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ నిన్న అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనుండటంతో, ఏప్రిల్ 25న జస్టిస్ లీసా గిల్ బాధ్యతలు స్వీకరిస్తారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపుల అనంతరం, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 217 (1) ప్రకారం రాష్ట్రపతి ఈ నియామకాన్ని ఆమోదించారు. సుప్రీంకోర్టు కొలీజియం ఫిబ్రవరి 26న జస్టిస్ లీసా గిల్ పేరును ఏపీ హైకోర్టు సీజే పదవికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ లీసా గిల్ గతంలో పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. సుప్రీంకోర్టు కొలీజియం కొత్తగా ప్రవేశపెట్టిన విధానం ప్రకారం, ఆమెను మార్చి నెలలోనే ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేశారు. కాబోయే ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు స్వీకరించేలోపు అక్కడి కోర్టు పరిపాలన వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ నియామకంతో ఏపీ హైకోర్టుకు తొలి మహిళా సీజేగా జస్టిస్ లీసా గిల్ చరిత్ర సృష్టించారు.

# చంద్రబాబు, పవన్ కల్యాణ్ పులి మీద స్వారీ చేస్తున్నారు: సీపీఐ నారాయణ

**డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలు ప్రాధాన్యత కోల్పోతాయన్న నారాయణ**

**ఈ విషయాన్ని చంద్రబాబు వంటి నేతలు గుర్తించకపోవడం విచారకమని వ్యాఖ్య**

**ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లను పెంచుకోవాలని బీజేపీ చూస్తోందని విమర్శ**



నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమ ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం ఉందని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం సీట్ల సంఖ్య పెరగడం వల్ల ప్రయోజనం ఉండదని, అది అభివృద్ధిని కుంటుపరుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పునర్విభజన వల్ల పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కబడుతుందని, ఈ విషయాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వంటి సీనియర్ నేతలు గుర్తించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. దక్షిణాదిలో బీజేపీకి ఆదరణ లేదన్న ఉద్దేశంతో, ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లను పెంచుకుని పార్లమెంట్‌లో ఏకపక్షంగా బిల్లులను ఆమోదించుకోవాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును సాకుగా చూపి, దాని వెనుక డీలిమిటేషన్‌ను తీసుకురావడం బీజేపీ వేస్తున్న పెద్ద ఎత్తుగడ అని నారాయణ విమర్శించారు. మోదీ, అమిత్ షా వంటి నేతలకు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మద్దతు తెలపడం 'పులి మీద స్వారీ' చేయడమేనని, ఇది భవిష్యత్తులో రాష్ట్రానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

# రష్యా చమురు కొనుగోళ్లపై ఆంక్షల సడలింపు

**అమెరికా మంత్రి కీలక వ్యాఖ్యలు**

**రష్యా చమురు కొనుగోళ్లపై నెల రోజుల పాటు ఆంక్షల సడలింపు**

**కొరత ఎదుర్కొంటున్న దేశాల అభ్యర్థన మేరకు ఆంక్షలు సడలించినట్లు వెల్లడి**

**వివిధ దేశాలు అమెరికాను సంప్రదించాయన్న మంత్రి స్కాట్ బెసెంట్**



రష్యా చమురు కొనుగోళ్లపై ఉన్న ఆంక్షలను అమెరికా మరోసారి సడలించడంపై ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. చమురు కొరతను ఎదుర్కొంటున్న దేశాల అభ్యర్థన మేరకు ఈ ఆంక్షలను సడలించినట్లు ఆయన తెలిపారు. సముద్రమార్గంలోని రష్యా చమురును వివిధ దేశాలు కొనుగోలు చేయడానికి అనుగుణంగా నెలరోజుల పాటు మినహాయింపును అమెరికా పొడిగించింది. ఇటీవల జరిగిన ప్రపంచ ఆర్థిక సమావేశాల సమయంలో ఈ సడలింపులపై తమకు అభ్యర్థనలు వచ్చాయని బెసెంట్ వెల్లడించారు. ఇంధన కొరతను ఎదుర్కొంటున్న పదికి పైగా దేశాలు అమెరికాను సంప్రదించి, రష్యా చమురుపై ఆంక్షలను సడలించాలని కోరినట్లు వెల్లడించారు. ఈ కారణంగానే ఆంక్షల సడలింపును మరో నెల రోజులు పొడిగించినట్లు చెప్పారు. ఇరాన్‌తో దాదాపు రెండు నెలలుగా యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి భారత్ సహా అన్ని దేశాలకు అమెరికా అనుమతినిచ్చింది. తొలుత ఈ మినహాయింపులు పొడిగించమని చెప్పిన అమెరికా, ఆ తర్వాత నెల రోజుల పాటు కొనుగోలుకు ఊరట కల్పించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రవాణాకు అడ్డంకులు తొలగించడానికి, ధరల స్థిరీకరణకు ఈ చర్యలు తీసుకున్నట్లు బెసెంట్ తెలిపారు.

# మందుబాబుల రక్తం దోమలకు ఎందుకంత ఇష్టం

**సైన్స్ చెప్పిన నిజం!**



శరీరంపై చెమట, రసాయనాల్లో వచ్చే మార్పులు కూడా దోమలను ఆకర్షించేందుకు కారణంచల్లటి సాయంత్రం వేళ స్నేహితులతో కలిసి కూర్చుని డ్రింక్ చేస్తున్నప్పుడు దోమల బెడద ఎక్కువగా ఉన్నట్టు ఎప్పుడైనా గమనించారా? మిగతా వారికంటే మిమ్మల్నే దోమలు ఎక్కువగా కుడుతున్నట్టు అనిపించిందా? ఇది కేవలం యాదృచ్ఛికం కాకపోవచ్చు. మద్యపానానికి, దోమల కాటుకు మధ్య సంబంధం ఉందని శాస్త్రీయ పరిశోధనలు సూచిస్తున్నాయి. ఈ విషయంపై జరిగిన అధ్యయనాలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడిస్తున్నాయి. 2002లో 'జర్నల్ ఆఫ్ ది అమెరికన్ మస్కిటో కంట్రోల్ అసోసియేషన్' ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం ఆల్కహాల్ సేవించిన వ్యక్తుల వైపు దోమలు ఎక్కువగా ఆకర్షితమవుతాయని తేలింది. ఈ పరిశోధనలో భాగంగా ఒక బీర్ తాగిన వ్యక్తులను దోమలు ఎక్కువగా కుట్టినట్టు గమనించారు. ఆల్కహాల్ తీసుకోని వారితో పోలిస్తే, బీర్ తాగిన వారిని దోమలు కుట్టే అవకాశం 1.35 రెట్లు అధికంగా ఉన్నట్టు ఈ అధ్యయనం తేల్చింది. అయితే, దీని వెనుక ఉన్న కారణాలను అర్థం చేసుకోవాలంటే అసలు దోమలు తమ ఆహారాన్ని ఎలా ఎంచుకుంటాయో తెలుసుకోవాలి. దోమలు తమ లక్ష్యాన్ని ఎంచుకోవడానికి కొన్ని నిర్దిష్ట సంకేతాలపై ఆధారపడతాయి. వాటిలో ముఖ్యమైనవి.

**కార్బన్ డయాక్సైడ్:** మనం శ్వాస వదిలినప్పుడు విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్ వాసన దోమలను బలంగా ఆకర్షిస్తుంది.

**శరీర ఉష్ణోగ్రత:** శరీర వేడి ఎక్కువగా ఉన్నవారిని దోమలు సులభంగా గుర్తిస్తాయి.

**శరీర వాసన:** మన చర్మంపై ఉండే బ్యాక్టీరియా, చెమటలో ఉండే లాక్టిక్ యాసిడ్ వంటి రసాయనాలు విడుదల చేసే వాసనలు దోమలకు ప్రధాన ఆకర్షణ. మద్యం సేవించినప్పుడు మన శరీరంలో జరిగే మార్పులు ఈ సంకేతాలను మరింత బలంగా మారుస్తాయి. ఆల్కహాల్ తీసుకున్నప్పుడు జీవక్రియల వేగం పెరిగి, శ్వాస ద్వారా ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంది. అంతేగాక చర్మం ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. మద్యం ప్రభావంతో చెమట ఎక్కువగా పట్టడం వల్ల చర్మంపై లాక్టిక్ యాసిడ్ వంటి రసాయనాల స్థాయిలు కూడా పెరుగుతాయి. ఈ మూడు మార్పులు కలిసి దోమలకు స్పష్టమైన సంకేతాలు పంపి, వాటిని మనవైపు ఆకర్షిస్తాయి.

**ఇది అందరికీ వర్తిస్తుందా?**

మద్యం తాగితే దోమలు ఎక్కువగా కుడతాయనే వాదన ఉన్నప్పటికీ, ఇది అందరిలోనూ ఒకేలా ఉండకపోవచ్చు. దోమల కాటుపై జన్యువులు, రక్త వర్గం (ముఖ్యంగా 'ఓ' బ్లడ్ గ్రూప్), జీవక్రియలు, చర్మంపై ఉండే సహజ రసాయనాలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. అందువల్ల, ఆల్కహాల్ అనేది దోమలను ఆకర్షించే ఒక అదనపు కారణంగా మాత్రమే చూడాలి. దోమకాటు కేవలం దురద, చికాకుతో ముగిసిపోయే విషయం కాదు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేయడంలో దోమలు కీలక పాత్ర పోషిస్తాయి. అందుకే సాయంత్రం వేళ ఆరుబయట గడిపేటప్పుడు, ముఖ్యంగా మద్యం సేవించే అలవాటు ఉంటే మరింత జాగ్రత్తగా ఉండటం అవసరం. దోమల నివారణకు రిపెల్లెంట్లు వాడటం, పొడవాటి చేతులున్న దుస్తులు ధరించడం, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ ముప్పు నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com